## ఘనంగా బంగారు మైసమ్మ బోనాలు





**మిడ్జిల్ ఆగస్టు 03, (జర్నలిస్ట్ డైరీ) :** మిడ్జిల్ మండలంలోని మసిగుండ్లపల్లి గ్రామంలో బంగారు మైసమ్మ బండ్ల బోనాల వేడుకలను గ్రామ సర్పంచ్ గోదా శ్రీశైలం, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోదా శ్రీశైలంతో పాటు భీమ్‌రాజు, వెంకటయ్య, శీను, ప్రదీప్‌రెడ్డి, శేఖర్, శ్రీశైలం, ఉమేష్, లాలయ్య, ఆంజనేయులు, యాదయ్య, లక్ష్మయ్య తదితర గ్రామ పెద్దలు, ప్రజలు పార్టీలకు అతీతంగా పాల్గొని బంగారు మైసమ్మ అమ్మవారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమం భక్తుల సందడితో ఉత్సాహంగా సాగింది.

## నవోదయ పాఠశాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**-రాధా-కృష్ణుల వేషధారణలో అలరించిన విద్యార్థులు**
**-ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల కరస్పాండెంట్ అనంతుల జంగయ్య**



**చింతపల్లి, సెప్టెంబర్ 3 (జర్నలిస్ట్ డైరీ) :** చింతపల్లి మండలం కుర్మేడు గేటు సమీపంలోని నవోదయ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పాఠశాల కరస్పాండెంట్ అనంతుల జంగయ్య గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు రాధా-కృష్ణుల, గోపికల వేషధారణలలో చేసిన నృత్యాలు, భక్తి గీతాల ఆలాపనలు, సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం ముఖ్య అతిథి అనంతుల జంగయ్య గౌడ్ మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడి జీవితం ధర్మం, కర్తవ్యనిష్ఠ, మరియు నిజాయితీకి నిలువెత్తు రూపమని కొనియాడారు. నేటి తరం విద్యార్థుల్లో భారతీయ సంస్కృతిని, నైతిక విలువలను పెంపొందించేందుకు విద్యాసంస్థల్లో ఇలాంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వేడుకల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు మరియు పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి తక్షణ పరిష్కారానికి చర్యలు

**-అందుకోసమే పల్లెనిద్ర కార్యక్రమం**
**-ప్రతి అర్జీని సీరియస్ గా తీసుకుంటాం.**
**-మీ సమస్యకు సత్వర పరిష్కారం చూపుతాము**

**గుడ్లూరు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ ;** స్థానిక సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ద్వారా జిల్లా యంత్రాంగం మొత్తం మీ మధ్యకు వస్తున్నది. ప్రతి అర్జీని సీరియస్ గా తీసుకుంటాం. మీ సమస్యకు సత్వర పరిష్కారం చూపుతాము. ఆర్థికేతర సమస్యలపై అధికారులు తక్షణమే దృష్టి సారిస్తారు. ఆర్థికపరమైన సమస్యలను కూడా రాష్ట్ర ప్రభుత్వ దృష్టికిగీ తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం '... అని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. గురువారం ఆయన గుడ్లూరు మండలం చిమిడిదెపాడు గ్రామంలో నిర్వహించిన పల్లెనిద్ర కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారితో కలిసి ప్రజలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. స్థానికుల మంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజలతో ముఖాముఖి చర్చించి వారి సమస్యలను సత్వరం పరిష్కరించేందుకే ' పల్లెనిద్ర ' కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మెరుగైన జీవనోపాధి కోసం ఉపయోగించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ' మనమిత్ర ' వాట్సప్ సేవలు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే ' కౌశలం ', విపత్తుల సమాచారాన్ని క్షణాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచే ' అవేర్ 2.0 ' ఆన్లైన్ పోర్టల్ గురించి స్వయంగా కలెక్టరే ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామం లోని గర్భిణులతో ఆయన






ప్రత్యేకంగా మాట్లాడారు. తల్లీబిడ్డ ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. అంగన్వాడీ, ఏ.ఎన్.ఎం.ల ద్వారా లభిస్తున్న సేవలను వినియోగించుకోవాలని, పోషకాహారం తీసుకుంటూ సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కాగా, వైద్యుల ద్వారా పొందుతున్న సేవలపై గర్భిణులు సంతృప్తి వ్యక్తం చేశారు.

**కొత్త బ్రిడ్జి కావాలి, పొలాలకు రోడ్లు వేయాలి**

స్థానికులు మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 488 కుటుంబాలు ఉన్నాయని, చెప్పారు. గ్రామంలోని మురుగునీరు పంట కాలువలో కలుస్తుండడం వలన పంటలకు నష్టం కలుగుతోందని, కాలువలోకి దిగుతున్న వారికి చర్మ సంబంధ సమస్యలు వస్తున్నాయని చెప్పారు. గ్రామానికి ప్రవేశ మార్గంలో కొత్త బ్రిడ్జి కావాలని, పొలాలకు రోడ్లు వేయాలని, గ్రామంలోపలికి బస్సు సౌకర్యం కల్పించాలని, స్మశానానికి స్థలం కేటాయించాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

**సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలి**

గ్రామస్తులు ప్రస్తావించిన సమస్యలను కలెక్టర్ ఓపికతో విన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి తక్షణమే దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆర్థికేతర సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఈ సందర్భంగా రూ.27.27 కోట్ల విలువైన బ్యాంకు చెక్కును అందించారు. ఈ రుణాలను మెరుగైన జీవనోపాధికి వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం మొత్తం ప్రజల వద్దకు రావడం హర్షనీయమన్నారు. గ్రామస్తులు ప్రస్తావించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సాధించాలని కోరారు. ముఖ్యంగా, రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ డి. హిమవంశీ, జెడ్పీ సీ.ఈ.వో. చిరంజీవి, డిపిఓ అనుపమ, స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు సచివాలయాల జిల్లా అధికారి వెంకటేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

దీనికి ముందుగా మండలంలోని అన్ని గ్రామాల్లో జిల్లా స్థాయి అధికారులు పర్యటించి స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పల్లెనిద్ర కార్యక్రమంలో కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కాగా, ఈ సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు తక్షణమే దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ గడువు సెప్టెంబర్ 10 వరకు పొడిగింపు

**-మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత.**
**-సెప్టెంబర్ 5, 6 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో అదనపు ప్రత్యేక ప్రచార దినాలు**
**-అభ్యంతరాలు, దరఖాస్తులను స్వీకరించనున్న బీఎల్ఓలు**
**-అర్హులందరూ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలి**
**-జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి**

**మార్కాపురం, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు అర్హులైన పౌరులందరికీ ఓటరు హక్కు కల్పించే లక్ష్యంతో చేపట్టిన "ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (అర్హత తేదీ: 01.07.2026)" కింద దరఖాస్తులు, అభ్యంతరాల సమర్పణ గడువును సెప్టెంబర్ 10, 2026 వరకు పొడిగించినట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఎం. విజయ సునీత, ఒక ప్రకటనలో తెలిపారు. విస్తృత ప్రజా ప్రయోజనాల దృష్ట్యా సవరించిన షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 5 మరియు 6వ తేదీలలో (శని, ఆదివారాలు) జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు ప్రత్యేక ప్రచార దినాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

**ప్రత్యేక ప్రచార దినాల సేవలు (సెప్టెంబర్ 5, 6 తేదీలలో):**

కేంద్రాల్లో అందుబాటులో బీఎల్ఓలు...

అన్ని పోలింగ్ స్టేషన్లలో బూత్ స్థాయి అధికారులు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లతో కలసి ఉదయం నుండి అందుబాటులో ఉంటారని తెలియజేశారు.

**పరిశీలన మరియు సహాయం:**

ఓటర్ల జాబితాలను పరిశీలించడం, పేర్ల నమోదు, సవరణలు, మార్పులు మరియు చేర్పులకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరిస్తారని పేర్కొన్నారు. దరఖాస్తుదారుల సందేహాలను నివృత్తి చేస్తూ సరైన మార్గదర్శకత్వం అందిస్తారని స్పష్టం చేశారు.

ప్రత్యేక విచారణా శిబిరాలు

ఈ రెండు రోజులలో ఈఆర్ఓలు ఏఈఆర్ఓల ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల్లో దరఖాస్తుల విచారణ కూడా నిర్వహించబడుతుందని తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలిఓటరు జాబితాలో సవరణలు, కొత్త నమోదులు కోరే పౌరులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని గుర్తింపు పొందిన అన్ని జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు మరియు సంబంధిత సిబ్బంది ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సూర్యాపేట "టౌన్ ప్లానింగ్" అధికారి'పై 'ఏసీబీ' దాడులు

**సూర్యాపేట,జర్నలిస్ట్ డైరీ :** ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై సూర్యాపేట మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి, కోదాడ మున్సిపాలిటీ ఇన్‌చార్జి టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న వుయ్యాల సోమయ్యపై తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు నమోదు చేసింది. అవినీతి పద్ధతులు, అనుమానాస్పద మార్గాల ద్వారా విధుల్లో ఉన్న సమయంలో ఆస్తులు సంపాదించినట్లు ఆరోపణలు రావడంతో అవినీతి నిరోధక చట్టం, 1988లోని సెక్షన్ 13(1)(బి)తో పాటు 13(2) కింద నల్గొండ రేంజ్ ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 3న ఆయన కార్యాలయం, నివాసం, బంధువులు, సన్నిహితులు తదితరులకు సంబంధించిన 8 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు.

**భారీగా ఆస్తులు, నగదు గుర్తింపు**

ఈ సోదాల్లో పలు ఆస్తులకు సంబంధించిన పత్రాలను అధికారులు గుర్తించారు. వాటిలో సూర్యాపేట జిల్లాలో 3 ఎకరాల 3 గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమి అధికారిక విలువ రూ.2,94,000గా ఉంది. అలాగే సూర్యాపేట జిల్లా పరిధిలోని సూర్యాపేట, హయత్‌నగర్ ప్రాంతాల్లో ఐదు నివాస ఆస్తులను గుర్తించారు. వీటిలో జి+1 భవనం, జి+2 భవనం, జి+4తో పాటు పెంట్‌హౌస్ భవనం, రెండు గ్రౌండ్‌ఫ్లోర్ ఇళ్లు ఉన్నాయి. వీటి మొత్తం అధికారిక విలువ రూ.2.75 కోట్లుగా అధికారులు





పేర్కొన్నారు. ఇక సూర్యాపేట పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎనిమిది ఖాళీ స్థలాలను గుర్తించగా, వాటి అధికారిక విలువ రూ.2,58,500గా ఉంది. అయితే ఈ ఆస్తుల మార్కెట్



విలువ అధికారిక విలువ కంటే చాలా ఎక్కువగా ఉంటుందని ఏసీబీ తెలిపింది.

**రూ.49 లక్షల బంగారు రుణం**

సోదాల్లో రూ.4,63,990 నగదు, రూ.13 లక్షల బ్యాంకు నిల్వలు వున్నట్లుగా అధికారులు గుర్తించారు. అలాగే 709 గ్రాముల బంగారు ఆభరణాలు, 1,750 గ్రాముల వెండి ఆభరణాలు లభించాయి. వీటి విలువ సుమారు రూ.20 లక్షలుగా అంచనా వేశారు. రెండు నాలుగు చక్రాల వాహనాలు, మూడు ద్విచక్ర వాహనాలు కూడా గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.25.20 లక్షలుగా పేర్కొన్నారు. ఇంటి సామగ్రి, ఎలక్ట్రానిక్ గాడ్జెట్ల విలువ సుమారు రూ.11 లక్షలుగా అంచనా వేశారు. అదేవిధంగా బ్యాంకులో 66 తులాల బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.49 లక్షల బంగారు రుణం పొందినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు.

**రూ.3.54 కోట్లుగా ఆస్తుల అంచనా**

ప్రాథమికంగా నిర్వహించిన సోదాల్లో గుర్తించిన వివరాల ఆధారంగా అధికారి మొత్తం ఆస్తుల విలువ రూ.3,54,36,490గా ఏసీబీ అధికారులు అంచనా వేశారు. మరికొన్ని అదనపు ఆస్తులపై కూడా అధికారులు వెరిఫికేషన్ కొనసాగిస్తున్నారు. సోదాల అనంతరం నిందితుడిని హైదరాబాద్‌లోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించనున్నట్లు ఏసీబీ తెలిపింది. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.



**అవినీతి నిరోధక శాఖ హెల్ప్‌లైన్**

1064. ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేసినట్లయితే ఈ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ ప్రజలకు సూచించింది.

